


# మేఘస్వాతి

- విశ్వనాధ రమ

**అప్పుడే తెలతెలవారుతోంది.**

**పొగమంచులో తడిసిన లిల్లీపూలని, బంగారు రంగులో ఉన్న బంతి పూలని కిటికీ దగ్గర నిల్చుని తదేకంగా చూడ సాగాడు శరత్.**

స్వతహాగా చిత్రకారుడు కావడం వల్ల కాబోలు, వేకువ అంటే చెప్పలేనంత మక్కువ అతనికి.

పక్షుల కిలకిలా రావాలు వింటూ, ముందుకి సాగుతున్న మేఘాల గుంపుని చూస్తూ ఒద్దికగా విప్పారుతున్న పుష్పాల అందాలను వీక్షిస్తూ... ఆ సృష్టికర్త కళాత్మక హృదయాన్ని మనసులోనే పొగుడుతూంటాడు.

నిజమే! ఆ భగవంతుడే గొప్ప చిత్రకారుడు.

మంచు బిందువుని, మహాసాగరాన్ని కూడా అందంగా సృష్టించాడు.

అందుకే ఆ సృష్టికర్తని ఆదర్శంగా తీసుకుంటే చాలు.

ఎన్నో కళాఖండాలు కుంచెనుండి జాలువారతాయి అనుకొంటూ తల్లి అందించిన కాఫీ గ్లాసు అందుకున్నాడు.

సరిగ్గా అప్పుడే కాలింగ్ బెల్ శబ్దం వినిపించింది శరత్‌కి.

ఇంత ఉదయాన్నే తమింటికెవరొచ్చారు చెప్మా అనుకొంటూ ఆశ్చర్యంగా తల్లివైపు దృష్టి సారించాడు.

ఆ శబ్దానికి కాబోలు! శారద మొహంలో కోటి పుంజాల కాంతి ప్రసరించిందొక్కసారిగా.

సంతోషంతో ఉద్వేగ్నభరితురాలైందామె.

"సూర్యం మావయ్య వచ్చినట్లున్నాడు. తలుపు తియ్యి"అంది ఉత్సాహంగా.

మనసులో మరో ఆలోచనకి తావివ్వకుండా వెంటనే తలుపు తీసాడు శరత్.

తల్లి అంచనా కరెక్ట్. వచ్చింది సూర్యం మావయ్యే.

"బాగున్నావా" అంటూ లోపలికి అడుగుపెడుతూనే పలకరించాడు మావయ్య.

శరత్ తలూపి కూర్చోమన్నట్లుగా సోఫా చూపించాడు.

మావయ్యని చూడగానే తల్లి మొహం మరింతగా వెలిగిపోవడం గమనించాడు శరత్. రక్తసంబంధంలో గొప్పతనమదే కాబోలు!

కుశల ప్రశ్నలు పూర్తయ్యాయి.

"సూర్యం! నీ మేనల్లుడి పెళ్ళిచేసే బాధ్యత నీదే. ఏ ఆడపిల్లని చూసినా ఏదో వంక పెడుతున్నాడు. వాడికి నచ్చచెప్పి ఓ ఇంటివాణ్ణి చెయ్యి!" అంది శారద తమ్ముడికి కాఫీ అందిస్తూ.

ఇంత సడన్‌గా మావయ్య ఎందుకొచ్చాడో అప్పుడర్థమైంది శరత్‌కి.

తన పెళ్ళి వేగంగా జరిపించాలన్న తాపత్రయంతో పెళ్ళి సంబంధాలు చూడమని తల్లి బంధువులందరి మీదా ఒత్తడి తెస్తోంది.

తననో ఇంటివాణ్ణి చేయాలని తల్లిగా ఆమె ఆరాటం ఆమెది. కాని...తన ఆశలు తనవి.

తను కోరుకున్న లక్షణాలున్న అమ్మాయి తనకింకా తటస్థపడలేదు.

ఏ అమ్మాయిని చూసినా ఏదో లోపం కనిపిస్తోంది.

మనసులో రాజీపడలేక ... ఇంకా బ్రహ్మచారిగానే ఉండిపోయాడు.

ఇంజనీరుగా స్థిరపడి వేలకువేలు ఆర్జిస్తున్నా... మనసులో ఏదో వెలితి.

అందర్లో ఏదో విధంగా గుర్తింపు పొందాలని మనసారాటపడుతోంది.

బాల్యంనుండి చిత్రాలు గీసే అలవాటుండడంవల్ల గొప్ప ఆర్టిస్టుగా పేరు తెచ్చుకోవాలనే ఆశ ఆకాశంలో రోజురోజుకీ విస్తరిస్తోంది.

కాని... అదంత తేలికైన విషయంలా కనిపించడం లేదు.

మరోపక్క అప్సరసలాంటి భార్యని పొందాలనే కోరిక మనసులో అధికమవుతోంది.

ప్చ్! తను ఆ అదృష్టాన్ని పొందలేకపోతున్నాడు.

తన మనస్తత్వం గమనించి ఇంక లాభంలేదని కాబోలు! తల్లి సూర్యం మావయ్యని ఇంటికి రప్పించింది.

కాఫీ తాగడం పూర్తయ్యాక మావయ్య కొన్ని క్షణాలు దీర్ఘాలోచనలో మునిగిపోయాడు.

తర్వాత తలెత్తి "అక్కా! ముందు మేనల్లుడి అభిప్రాయం తెలుసుకోవడం మంచిది!" అన్నాడు.

ఆ మాటలకి శరత్ ముసిముసిగా నవ్వి మొహానికి పేపర్ అడ్డం పెట్టుకున్నాడు.

శరత్ సిగ్గు, మొహమాటాన్ని ఓరకంట గమనించిన సూర్యం చనువుగా అతడి చేయందుకున్నాడు.

"ఏరా శరత్! అమ్మని ఎన్నాళ్ళు కష్టపెడతావ్! కోడలొస్తే ఆమెకి చేదోడు వాదోడుగా ఉంటుందిగా. వేగంగా పెళ్ళిచేసుకో!" అన్నాడు నచ్చచెబుతున్నట్లుగా.

ఆ అభిమానాన్ని అర్థంచేసుకొన్న శరత్ తల వొంచుకొనె "నాకు నచ్చిన అమ్మాయి కనిపించాలిగా!" అన్నాడు.

సూర్యం ముఖ కవళికల్లో మార్పొచ్చింది వెంటనే.

"నచ్చడం అంటే ఏవిట్రా! నీకు నచ్చాలా! ఊళ్ళో వాళ్ళకి నచ్చాలా! నీ పక్కన షోకేసులో బొమ్మలా కనిపించాలా! నీ కష్టసుఖాలు అర్థంచేసుకొని నీకు కుడి భుజంలా ఉండాలా!"

ఆ వాగ్ధాటికి శరత్‌కి మతిపోయింది. ఇక లాభంలేదనుకుని "మావయ్యా! మధ్యాహ్నం భోజనం అయ్యాక నా గదిలోకిరా! తీరుబడిగా మాట్లాడుకుందాం!" అన్నాడు.

సూర్యం నవ్వి శరత్ భుజం తట్టి "నీకు రెండు సంబంధాలు తెచ్చాన్రా! ఏ అమ్మాయి నచ్చితే ఆ అమ్మాయినే చేసుకో. నీ అభిప్రాయాలు గౌరవిస్తాను. సరేనా!" అన్నాడు.

ఆ మాటలకి బుద్ధిమంతుడిలా తలూపాడు శరత్.

కారణం సూర్యం మావయ్యకి బంధువర్గంలోనే కాదు, ఊళ్ళోకూడా మంచివాడని పేరుంది.

వందెకరాల పొలం ఉన్నా మావయ్యకున్న నిరాడంబరత ఎవరికీ ఉండకపోవడం కూడా గమనించాడు.

ప్రేమ సమాజం స్థాపించి దిక్కులేని పిల్లలని, వృద్ధులను ఆదుకొంటున్నాడు. అందుకే అందరికీ ఆప్తమిత్రుడైన మావయ్య తెచ్చిన సంబంధాలు చూడాలనిపించింది.

"తప్పకుండా నువ్వు తెచ్చిన సంబంధాలు చూస్తాను". భరోసా ఇస్తున్నట్లుగా అన్నాడు శరత్.

* * *

భోజనాలయ్యాక చేతి సంచీతో శరత్ గదిలోకి హుషారుగా అడుగుపెట్టాడు సూర్యం.

ఆ గదిలో గోడలకి వేలాడుతున్న పెయింటింగ్స్ చూసి ఎనలేని ఆశ్చర్యంతో "శరత్! ఇవన్నీ నువ్వు వేసినవేనా!" అన్నాడు సంబరంగా.

కించిత్ గర్వంతో శరత్ తలూపి 'పెయింటింగ్స్ గీయడమే కాదు కాంపిటీషన్స్‌లో కూడా పాల్గొంటాను. ఎగ్జిబిషన్స్‌కి నా చిత్రాలు పంపిస్తుంటాను!" అన్నాడు.

సూర్యం మెచ్చుకోలుగా శరత్ వైపు చూసాడు.

"బాగుందిరా! సున్నితమైన మనసున్నవాళ్ళే ఆర్టిస్టులవుతారంటారు.

సరే! అసలు విషయానికొద్దాం. నీకెలాంటి అమ్మాయి కావాలో చెప్పు!" అన్నాడు ఆసక్తిగా.

శరత్ సిగ్గుపడుతూ "ముందు నువ్వు తెచ్చిన సంబంధాల వివరాలు చెప్పు!" అన్నాడు.

వెంటనే చేతి సంచిలో ఉన్న డైరీ తీసాడు సూర్యం. పేజీలు తిరగేస్తూ చెప్పడం మొదలుపెట్టాడు.

"రామనాధంగారి పెద్దమ్మాయి పేరు మేఘస్వాతి. పి.జి. చేసింది. నీలాగే పెయింటింగ్స్ వేసి నేషనల్ పెయింటింగ్ కాంపిటీషన్స్‌కి పంపిస్తుంటుంది. ఎన్నో బహుమతులు గెలుచుకుంది!" అంటూ సూర్యం వాలుగా శరత్ మొహంలోకి చూసాడు.

శరత్ వదనం పుచ్చపూవులా వికసించింది. కళాకారుడికి కళ విలువ తెలిసి అందులో ప్రావీణ్యం ఉన్న అమ్మాయి దొరికితే అంతకన్నా అదృష్టం మరొకటుంటుందా!

మేఘస్వాతి... ఈ పేరు తనకి బాగా పరిచయమే.

ఆమె వేసిన చిత్రాలు ఎగ్జిబిషన్‌లో చూసాడు.

బాగా పేరున్న ఆర్టిస్టు మేఘస్వాతి.

ఆమెని పెళ్ళిచేసుకుంటే తనూహించిన గుర్తింపు కలుగుతుంది.

ఆమె అండదండలతో తనెన్నో కళారూపాలు సృష్టించవచ్చు.

ఇన్నాళ్ళకి తన కల ఫలించినట్లనిపిస్తోంది.

గుండెల్లోంచి ఆనందం పెల్లుబుకుతూంటే "ఈ సంబంధం బాగుంది. ఆమెని చూడ్డానికి...!"అంటూ ఇంకా ఏదో అనబోయాడు.

మధ్యలోనే సూర్యం అడ్డుతగిలి "ఆగాగు. వెంటనే ఓ నిర్ణయానికి రాకు. పెళ్ళికూతురు మేఘస్వాతి కాదు. ఆమె చెల్లెలు స్రవంతి.

స్రవంతి నీలాగే ఇంజనీరు. మంచి అందగత్తె. ఈ సంబంధం నీకు నచ్చుతుందనే ఆశతో ఫొటోకూడా తెచ్చాను!" అంటూ ఫొటో ఉన్న కవరు శరత్ చేతిలో ఉంచాడు.

విస్తుపోయాడు శరత్. "మరి మేఘస్వాతి...?" అర్ధం కానట్లు సూర్యం మొహంలోకి సూటిగా చూసాడు.

భారంగా నిట్టూర్చాడు సూర్యం.

"మేఘస్వాతికి బాల్యంలోనే ఓ కాలు పోలియోవల్ల బలహీనపడి చచ్చుబడిపోయింది. కర్ర సహాయంతో మాత్రమే నడవగలదు.

అందరూ ఆమె వేసిన పెయింటింగ్స్ ఇష్టపడుతున్నారు. కాని ఆమెని పెళ్ళాడ్డానికెవరూ ముందుకి రాలేదు.



నూటికినూరుపాళ్ళు సజీవత్వం ఉట్టిపడే ఆమె చిత్రాలు చూసి తనే ముగ్ధుడవుతున్నాడు. అంగవైకల్యం ఉన్నా... ఆత్మన్యూనతతో బాధపడకుండా గొప్ప చిత్రకారిణిగా అంతర్జాతీయ ఖ్యాతి పొందడం చాలా గొప్ప విషయమే.

ఈ కాలం అబ్బాయిలకి అందం, ఉద్యోగం...ఇలా ఒకటేమిటి? అన్నీ కావాలి. ఇంక ఆదర్శానికి ఆస్కారమెక్కడ?

పోన్లే శరత్! ఎవరి ఆశలు వాళ్ళవి. కోరికలతో కొట్టుకుపోతున్న యువతని ఆదర్శంవైపు మళ్ళించడం సాహసమే.

నీ కోరికలకు తగినట్లుగా ఉంటుంది స్రవంతి. నీకు తగిన జోడీ కూడా. ఆలోచించుకో! అన్నాడతను.

శరత్ మెదడు మొద్దుబారిపోయింది. అప్పటికే మనసంతా శూన్యంతో నిండిపోయింది.

మేఘస్వాతిని చూడ్డానికి పెళ్ళిచూపులకి వెళ్ళాలనుకున్నాడు.

ఓ ఆర్టిస్టుగా ఆమెతో కలసి ఎన్నో విషయాలు చర్చించాలనుకున్నాడు.

కాని... ఆమెకి వైకల్యం ఉందని తెలిసేసరికి...ఏదో షాక్ తగిలినట్లనిపిస్తోంది.

నిరాశానిస్పృహలు ఒక్కసారిగా ఒంటిని కమ్మేశాయి.

అంతలోనే...ఎన్నో రకాల ఆలోచన్లు అతనిలో కొత్త పుంతలు తొక్కసాగాయి. మేఘస్వాతి చాలా గొప్ప ఆర్టిస్టు! ఆమెని కలవాలని ఎప్పటినుంచో ఉవ్విళ్ళూరుతున్నాడు.

నూటికినూరుపాళ్ళు సజీవత్వం ఉట్టిపడే ఆమె చిత్రాలు చూసి తనే ముగ్ధుడవుతున్నాడు.

అంగవైకల్యం ఉన్నా... ఆత్మన్యూనతతో బాధపడకుండా గొప్ప చిత్రకారిణిగా అంతర్జాతీయ ఖ్యాతిపొందడం చాలా గొప్ప విషయమే.

ఆమె ఆ స్థాయిని ఎలా చేరుకుంది?

మేఘస్వాతి విజయం వెనుక ఎవరున్నారు?

ఏ శక్తి ఆమెని ముందుకి నడిపిస్తోంది.

తను ఆమె స్థాయినెందుకు చేరుకోలేకపోతున్నాడు?

ఇవన్నీ తెలుసుకోవాలంటే స్రవంతిని చూడ్డానికి తను రామనాధంగారింటికి వెళ్ళాలి.

నిజానికి స్రవంతి బంగారుబొమ్మలా ఉన్నా ఆమెని చూడాలనిపించడం లేదు.

మనసు మేఘస్వాతి చుట్టూ తిరుగుతోంది.

ఈ అవకాశం జారవిడుచుకోకూడదు.

మావయ్యతో స్రవంతిని చూడ్డానికి వెళదామని చెప్పి... ఏదో విధంగా మేఘస్వాతిని కలిసి ఆమె ఆలోచన్లు గ్రహించి, ఆమెవేసిన పెయింటింగ్స్ పరిశీలించాలి.

తను అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలంటే ఇదొక్కటే మార్గం.

ఈ నిజం మావయ్యకి చెబితే ఆ ఇంటి ఛాయలకే వెళ్ళడం అనవసరమంటాడు.

తననో స్వార్థపరుడిలా, అవకాశవాదిలా ముద్రవేస్తాడు.

ఈ వాస్తవాల్ని మావయ్యకేనాడూ చెప్పకూడదు.

తన సమాధానంకోసం ఎదురుచూస్తున్న సూర్యం మావయ్య వైపు సాలోచనగా చూస్తూ "ఈ సాయంకాలమే స్రవంతిని చూడ్డానికి వెళదాం!"అన్నాడు దృఢంగా.

"నాకు తెలుసురా. స్రవంతి లాంటి అమ్మాయికోసమే నువ్వెదురు చూస్తున్నావని. ఈ సంబంధం నీకు తప్పకుండా నచ్చుతుంది!" అన్నాడు సూర్యం చిరునవ్వుతో.

శరత్‌లో ఆలోచన్లు మళ్ళా మేఘస్వాతి వైపు మళ్ళాయి.

* * *


పెళ్ళిచూపులకి వచ్చిన శరత్‌ని, సూర్యాన్ని రామనాధంగారు సాదరంగా ఆహ్వానించారు. మర్యాదలకి లోటు రానివ్వలేదు.


తనెదురుగా కూర్చున్న స్రవంతి సూర్యం మావయ్య చెప్పిన దానికన్నా అందంగా కనిపించింది శరత్‌కి.

అయినా ఆమెవైపు మొక్కుబడిగా చూసి హాల్లో ఉన్న పెయింటింగ్స్ వైపు దృష్టి మరల్చాడు శరత్.

పక్క గదిలోంచి కర్ర చప్పుడు వినిపిస్తోంది. అతడికర్థమైంది. మేఘస్వాతి పక్కగదిలో ఉందని.

(మిగతా 27వ పేజీలో)



(19వ పేజీ తరువాయి)

ఏదో ఉద్వేగం శరీరాన్ని కమ్మేస్తోంది. ఉన్నపళంగా వెళ్ళి ఆమెని చూడాలనిపిస్తోంది.

స్రవంతిని చూడ్డానికొచ్చి మేఘస్వాతికోసం ఆరాట మెందుకని ఒకపక్క అంతరాత్మ నిలదీస్తోంది.

అలా అని అంగవైకల్యం ఉన్న మేఘస్వాతి మెడలో తాళి కట్టడానికి తను సిద్ధంగా లేడు.

కేవలం తన స్వార్థంకోసమే ఇలా వచ్చాడు మరి.

"స్రవంతితో ఏదైనా మాట్లాడు!" సూర్యం మావయ్య మోచేత్తో పొడుస్తూంటే శరత్ ఆలోచన్లనుండి తేరుకు న్నాడు.

ఎదురుగా ఉన్న స్రవంతి అందానికి ప్రతీకలా వెలిగి పోతోంది.

ఒకప్పుడు అప్సరసలాంటి అమ్మాయికోసం అన్వేషిం చాడు.

ఇప్పుడు స్రవంతి అప్సరసలా కనిపిస్తున్నా... ఆమె మీద అస్సలు ఆసక్తి కలగడంలేదు.

అంగవైకల్యం ఉన్నా ఆత్మవిశ్వాసంతో గొప్ప ఆర్టిస్టుగా కీర్తి బావుటా ఎగరవేస్తున్న మేఘస్వాతిని చూడాలని మనసు తహతహలాడుతోంది.

తప్పదన్నట్లుగా స్రవంతితో రెండుముక్కలు మాట్లా డేడు శరత్.

తర్వాత వాలుగా సూర్యంవైపు చూస్తూ "మేఘస్వాతి కూడా నాలాగే చిత్రాలు గీస్తుంది కదా! ఓసారి ఆమెతో మాట్లాడతాను!" అన్నాడు మెల్లగా.

సూర్యం సంతోషంగా తలూపి రామనాథంగారికీ విషయం చెప్పేడు. అతను ఏమాత్రం సంకోచించ కుండా "అలాగే బాబు! మా పెద్దమ్మాయిని చూపి స్తాను, రండి!" అంటూ పక్క గది వైపు శరత్‌ని తీసుకు వెళ్ళారు.

అక్కడ...

కేన్వాస్ మీద చిత్రం గీస్తున్న మేఘస్వాతి అలికిడికి ఉలిక్కిపడి వెనక్కి తిరిగింది.

పరిచయాలు అయ్యాయి. స్రవంతిలా మేఘస్వాతి అందగత్తెకాకపోయినా ఆ మొహంలో మనోనిబ్బరం, ఆత్మస్థైర్యం మెండుగా ఉన్నాయి.

విప్పారిన నేత్రాలతో ఆమెని చూస్తూ "మీ పెయిం టింగ్స్ అద్భుతంగా ఉంటాయి!" అన్నాడు శరత్.

మేఘస్వాతి నవ్వి "మీరు కూడా ఆర్టిస్టు అని నాన్న గారు చెప్పారు. కొత్తగా వేసిన ఈ పెయింటింగ్స్ చూడండి!"అంటూ తను గీసిన పెయింటింగ్స్ శరత్ చేతికందించింది.

ఆ చిత్రాలు చూసి కదిలిపోయాడు శరత్. ఉద్వేగానికి లోనయ్యాడు.

అనాధ బాలల ఆక్రందనలు, గృహహింసకి బలైన ఆడపడుచులు, రైతుల్ని దోచుకొంటున్న దళారులు, వృద్ధాశ్రమాలు...ఇలా ప్రతీ చిత్రం మనసుని కదిలి స్తుంది.

శరత్‌కి అర్థమైంది. ప్రతీ మనిషిలో కదలిక తెచ్చేది కన్నీరు రప్పించేది వాస్తవ సంఘటనలే. చిత్రకారుడు తన చిత్రాల ద్వారా సామాజిక సమస్యల్ని ప్రతిబింబిం చినప్పుడే ఆ ఆర్టిస్టు ప్రతిభ ప్రపంచానికి వెల్లడవు తుంది.

మేఘస్వాతి ఈ విషయంలో అందరికన్నా ముందుంది. అందుకే కీర్తి శిఖరాల అంచున నిలబ డింది.

తను కూడా... ఆమెని అనుసరిస్తే తప్పకుండా గొప్ప ఆర్టిస్టు కాగలడు. శరత్‌లో ఆలోచన్ల వెల్లువ నింగిని తాకుతోంది.

మరో పది నిమిషాలు ఆమెతో మాట్లాడి అక్కణ్ణుంచి బయటపడ్డాడు శరత్.

* * *

ఆరు నెలలు గడిచాయి.

మేఘస్వాతిని కలిసిన దగ్గరనుండి శరత్ దృక్పథంలో బాగా మార్పొచ్చింది. తన ఆలోచన్లు పూర్తిగా మార్చుకు న్నాడు.

వాస్తవాన్ని యధాతథంగా చిత్రీకరిస్తూ... నేషనల్ పెయింటింగ్ కాంపిటీషన్‌లో బహుమతులు కూడా గెలుచుకొంటున్నాడు.

అతని చిత్రాలకి గిరాకి కూడా బాగా పెరిగింది.

రామనాథంగారి దగ్గరనుండి, సూర్యం మావయ్య నుండి శరత్‌కి ఫోన్లు తరచుగా వస్తున్నాయి కూడా.

స్రవంతి వచ్చిందా లేదా అని ఇద్దరూ ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తున్నారు.

"ఆలోచిస్తున్నాను" అంటూ శరత్ ఫోన్ పెట్టేస్తున్నాడు తప్ప మరో సమాధానం చెప్పడం లేదు.

ఒక రోజు ఉదయాన్నే మళ్ళా సూర్యం మావయ్య సడన్‌గా గుమ్మంలో అడుగు పెట్టేసరికి...శరత్ మునుప టిలా పెద్దగా ఆశ్చర్యపోలేదు.

అతడు స్రవంతి ప్రస్తావన తెస్తే... ఏం సమాధానం చెప్పాలో ముందుగానే నిర్ణయించుకున్నాడు.

ఆ మధ్యాహ్నం భోజనం చేసి శరత్ గదిలోకి అడుగు పెట్టాడు సూర్యం.

ఆ గదిలో వ్రేలాడుతున్న పెయింటింగ్స్ చూసి అతని కళ్ళల్లో అంతులేని ఆశ్చర్యం. ఇంతకుమునుపు ప్రతీ పెయింటింగ్‌లోను ప్రకృతి సౌందర్యం కనిపించేది.

ఇప్పుడు యదార్థ జీవిత సంఘటనలు దర్శనమిస్తు న్నాయి.

"శరత్! నీలో చాలా మార్పొచ్చిందిరా!" అన్నాడు సూర్యం.

శరత్‌లో ఏవో అలజడి. తనలో ఈ మార్పుకి కారణం మేఘస్వాతి. ఈ నిజం మావయ్యకి చెప్పాలనిపించ లేదు. మౌనంగా తలవొంచుకున్నాడు.

"నీ పెయింటింగ్స్‌కి బహుమతులొస్తున్నాయని, నువ్వు గొప్ప ఆర్టిస్టువి అయ్యావని విన్నాను. బహుశా మేఘస్వాతిని కలిసాక, ఆమె పెయింటింగ్సు చూసాక నీలో మార్పొచ్చే ఉంటుంది. పేరుప్రఖ్యాతులు రావా లంటే ఎలా చిత్రాలు గీయాలో మేఘస్వాతి ద్వారా తెలుసుకొని ఉంటావ్. ఔనా...!"

శరత్‌లో సంఘర్షణ మింటిని తాకుతోంది. మామయ్య చెప్పినది నిజమే. కాదని ఎలా అనగలడు?

సూర్యం మళ్ళీ గొంతు విప్పాడు.

"శరత్! ఆర్టిస్టుకి స్పందన ఉండాలి తప్ప స్వార్థం ఉండకూడదురా. పెళ్ళిచూపుల్లో మేఘస్వాతితో నువ్వు మాట్లాడతానని అన్నప్పుడే ఊహించాను. నువ్వు స్రవం తిని చూడ్డానికి రాలేదని మేఘస్వాతిని కలిసి ఆమె పెయింటింగ్స్ చూసి, ఆమె ఆలోచన్లు ఎలాంటివో తెలు సుకుందామని వచ్చావని అర్థమైంది.

శరత్! వికలాంగుల జీవితాన్ని చిత్రాల్లో గీసి బహు మతులు పొందుతున్నావ్. మరి వికలాంగని వివాహ మాడ్డానికెందుకు సంకోచిస్తున్నావ్?

ఆ భగవంతుడు తను సృష్టించిన గడ్డిపూవుని కూడా పూజకి అంగీకరిస్తాడు. దృష్టిదోషంవల్ల, సంకుచిత ధోర ణివల్ల మనమే ఆ పూవుని పక్కన పడేస్తున్నాం. విశాల మైన మనస్తత్వం ఉంటే అందర్నీ ప్రేమిస్తాం. ఆలో చించు" అన్నాడు.

అంతే! శరత్‌లో పశ్చాత్తాపం వెల్లువలా ఎగిసిపడింది. మరింకేం ఆలోచించలేదు.

"ముహూర్తాలు పెట్టించు మావయ్యా! మేఘస్వాతిని పెళ్ళాడతాను!" అన్నాడు నిండు మనసుతో. ★


**రచయిత చిరునామా:**

విశ్వనాథ రమ,
ప్లాట్ నెం: 34,
షిరిడిసాయినగర్ (బంగారుపల్లి గార్డెన్స్)
ధర్మపురి రోడ్డు, విజయనగరం- 2 (ఆం.ప్ర.)